# దాగిన సత్యం

"అదికాదు బావయ్యా! నా మాట విను. నువ్వు వెళ్లు. నేను నీవెంట ఇంటికి తిరిగి వచ్చేమాట ఒట్టిది. నువ్వు అమ్మకు ఏదో సర్దిచెప్పు. ఆవిడను ఏదోవిధంగా ఓదార్చు. నేను అతన్ని ప్రేమించాను. అతను నన్ను ప్రేమించాడు. ఇన్నాళ్ళు ఇలా జరిగింది. ఇంత జరిగాక నేను ఏ ముఖం పెట్టుకొని ఇంటికి వస్తానూ! వస్తే నన్ను బ్రతకనిస్తారా? ఎవరిదాకానో ఎందుకు మా అమ్మా, మా పెద్దమామయ్యా నన్ను ఒక్క క్షణం బ్రతకనిస్తారా! అది కుదరదు. ఈసారి పోయినవాడు తిరిగి వస్తాడా సరే సరి. రాడూ నేను ఇక్కడే ఉండి ఏ ఉద్యోగమో చూచుకొంటాను. ఇక్కడేదో గడ్డుగా కాలం గడుపుతాను. దీనికి నీ సహాయం అక్కర్లేదు. వెళ్లు. ఇంక నన్ను వాగించక వెళ్లు."

శాంత చెప్పడం ఆపి ఒక క్షణం గట్టిగా ఊపిరి తీసుకొన్నది.

అతనివంక కోపంగా చూచింది. సత్యం మాటాడలేదు కొంతసేపు. మరికొంతసేపు తర్వాత అతను ఎంతో నెమ్మదిగా "అమ్మాయి శాంతా! నేను మళ్ళీ మళ్ళీ చెబుతున్నా. మంచిగా చెబుతున్నా. నువ్వు రాక తప్పదు నిన్ను ఇక్కడ ఇలా ఒంటరిగా విడిచి వెళ్ళను. అన్నీ జాగ్రత్తగా ఆలోచించే ఈ నిర్ణయానికి వచ్చాను. నువ్వు మర్యాదగా వెంటనే రాకపోతే పోలీసుల సహాయంతో అయినా నిన్ను ఇల్లు చేరుస్తాను" అన్నాడు. ఆ మాటకు శాంత కోపంతో రెచ్చిపోయి వెంటనే "ఇంకేం ఆ పనే చేయ్యి. నేను రాను నువ్వు ఈ క్షణంలో బయటకు వెళ్ళకపోతే నిన్ను అల్లరిపెడతాను" అన్నది పెద్దగా.

అతను ఆ పిల్లమాటకు సమాధానం చెప్పకుండా నెమ్మదిగా కుర్చీలో నుంచి లేచి గదిగుమ్మం దగ్గరకు వెళ్ళి అక్కడ నిలబడి పిట్టగోడ మీదనుంచి క్రిందకు వంగి తప్పట్లుకొట్టి క్రింద ఉన్న పోలీసు ఇనస్పెక్టరును పైకి రమ్మని పిలిచాడు. ఆయన గదిలోకి వచ్చాక శాంతవంకకు తిరిగి "చూడు శాంతా! ఇతను నా స్నేహితుడు. మేం కలిసి చదువుకొన్నాం. ప్రస్తుత పరిస్థితిలో నాకు తన సాయం కావలసి వస్తుందని ఎంత వద్దన్నా వెంటవచ్చాడు'' అన్నాడు.

పోలీసు అధికారిని చూచి శాంత మారుమాటాడకుండా ఒక్క నిముషంలో పెట్టె సర్దుకొని సత్యంవెంట బయటకు వచ్చింది.

ఇంటికి వెళ్ళేదాకా ఆ పిల్ల అతనితో ఒక్కమాట అయినా మాటాడలేదు.

* * *

"పోన్లే అమ్మా నువ్వు బాధపడకు. నేను ఏమైనా అంటానని భయం పెట్టుకోకు. సత్యం అంతా చెప్పాడు. సినిమాలో చేరడానికి వెళ్ళినదానివి, ఆ విషయం మాకు పోనీ అక్కడనుంచి అయినా ఓకార్డు ముక్క వ్రాయకపొయ్యావా? అయినా నీ కిదేం పిచ్చి! నువ్వు పెద్ద అందకత్తెవా? సంగీత పాటకురాలవా? ఏమని తీసుకొంటారని వెళ్లావే? పోనీ అంత సరదా ఉంటే ఊళ్లో ఉన్నాడుకదా మీ పెద్ద మామయ్య, వాడికి చెప్పకపొయ్యావా! అటువంటి ప్రయత్నం చేసేవాడు.''

కనకమ్మగారు అలా రెండు రోజులదాకా మాటాడుతూనే ఉన్నది.

శాంత అన్నీ విని ఊరుకొన్నది.

తలవంచుకొని వినయం ప్రదర్శించింది. కనకమ్మగారు పూర్వం ఎప్పటికంటె ఎక్కువగా కూతురిపట్ల ప్రేమాభిమానాలు కనబరచింది. నెలలు నిండి అత్తవారింటినుంచి పుట్టింటికి వచ్చిన పిల్లకు చేసినట్టు కూర్చోపెట్టి సకలోపచారాలూ చేసింది.

మూడు నెలలు గడిచాయి.

కూతురు మనసు మార్చుకొన్నదనే కనకమ్మగారికి నమ్మకం కలిగింది.

ఆవిడ మనసు కుదుటపడ్డది. పిల్లకు వెంటనే పెళ్ళిచేయడం మంచిదని ఊళ్లోఉన్న అన్న రమణయ్యగారినీ, ఇంట్లోఉన్న సత్యాన్నీ అక్కడకూ ఇక్కడకూ పంపింది. కట్నం ఎంత అడిగితే అంత ఇవ్వడానికి సిద్ధపడ్డది ఆవిడ. ఒక్క రవ్వ దూరపు సంబంధం నిశ్చయం చేసుకొని దగ్గరలోనే లగ్నాలు పెట్టుకోవాలని ఆవిడ ఆశపడ్డది.

దూరపు సంబంధం ఒకటి మాటాడి వచ్చాడు సత్యం. కాని అందరికీ ఆశాభంగం అయ్యింది. రేపో ఎల్లుండో నాగపూరునుంచి పెళ్ళివారు తన్ను చూడడానికి వస్తారనగా శాంత మళ్ళీ ఇంట్లోనుంచి తప్పించుకొని పోయింది.

కనకమ్మగారు గుమ్మంలోనే కూలబడి పోయింది.

సత్యం నిజంగా కోపం పట్టలేక పోయాడు. అతను వెంటనే బయలుదేరి వెళ్లాడు. శాంత పట్నంలో పూర్వం దిగిన హోటలు గదిలోనే దిగింది. సామాన్లన్నా సరిగా సర్దుకోకముందే అతను అల్లా గుమ్మంలో కన్పించేసరికి శాంతకు కోపం వచ్చింది. అతన్ని చూడంగానే పెద్దగా "నాకు నువ్వెక్కడ దాపురించావయ్యా శనేశ్వరుడిలా. నా చావు నన్ను చావనీయ్. గుమ్మంలోంచే తిరిగి వెళ్లు. ఈసారి నువ్వు భయపెట్టినా, ఎవరిని వెంటపెట్టుకొని వచ్చినా, ఏమి చేసినా నేను ఇంటికి రాను రావడానికి వీలులేదు. ఇంటికీ నాకూ ఋణం తీరిపోయింది. నీకు భయపడి వచ్చానో నాకు నిజంగా చావే. నా కంటిముందు మా అమ్మ దొడ్డిగుమ్మం దగ్గర పట్టపగలు ఉరిపోసుకొని చస్తుంది" అన్నది

శాంత రొప్పుతూ. "ఏమిటే ఏమిటే ఆ అఘాయిత్యపు మాటలు! అంత ఉపద్రవము ఏమి వచ్చిందే?" అన్నాడు సత్యం.

"ఏమిటా- ఏమిటో చెబుతాను. చెబితేనే గాని నువ్వు పోవు. ఇదుగో విను. నాకు నాలుగో నెల. ఈ వ్యవహారమేదో పరిష్కారం చేసుకోడానికి వచ్చాను. సంగతి విన్నావుగా. ఇంక వెళ్ళు" అన్నది శాంత.

సత్యం నిర్ఘాంత పోయాడు.

అతనికి నోట మాట రాలేదు.

చాలా బాధపడి పొయ్యాడు. తికమక పడ్డాడు. అరచేత్తో నుదుటి మీద గట్టిగా కొట్టుకొన్నాడు. మధనపడ్డాడు. అంతలో ఏదో ఆలోచన వచ్చి కొంతసేపు నిశ్చలంగా ఉండిపోయాడు. కొన్ని నిముషాల తర్వాత అతను తేరుకొని చప్పున లేచి నిల్చొని "అమ్మాయి శాంతా ఆ గోపాలం ఇంటి చిరునామా వ్రాసి ఇవ్వు. వెళ్లి అతన్ని కలుసుకొంటాను. అతన్ని ఇక్కడకు తీసుకొని రావడానికి ప్రయత్నం చేస్తాను. అతను వస్తే మనం ఒక పని చేయవచ్చు. అతను రానంటే పెద్దవాళ్ళతో మాట్లాడతాను. వాళ్ళ కాళ్లు పట్టుకొని బ్రతిమాలికొనైనా ఇందుకు ఒప్పిస్తాను ఎన్ని ప్రయత్నాలు చెయ్యాలో అన్నీ చేస్తాను. నేను తిరిగి వచ్చేదాకా నువ్వు ఆ ప్రయత్నాలేమీ చెయ్యకు. అది చాల ప్రమాదం. జాగ్రత్తగా ఉండు" అన్నాడు. అనేక విధాల హెచ్చరించాడు.

* * *

"ఇదిగో గోపాలం! నీకు ఏమీ దాచకుండా విషయమంతా చెప్పాను. దీనికి మరో పరిష్కారం లేదు. దాని ప్రాణం కాపాడవలసింది నువ్వు. నువ్వు చాలా మంచివాడివనీ, తను వ్రాసిన ఉత్తరాలు అందక

ఇలా ఊరుకొని ఉంటావనీ, అన్నివిధాలా నువ్వు విశ్వసింపతగిన వాడవనీ శాంత చెప్పింది నీకు తనపై ఎంతో ప్రేమ ఉన్నదని చెప్పింది మీరు ఒకరినొకరు ప్రేమించుకొన్నారు. కనుకనే ఒకరినొకరు ఆదుకోవలసినవారు. మీరు ఏదో విధంగా సుఖంగా ఉండడమే మాకు కావలసింది. ముందు నువ్వు నావెంట అక్కడకు రా. శాంత నీకోసం దిగులుపడి పోయింది. ఈ పరిస్థితిలో నువ్వు రాకపోతే అది విషం పుచ్చుకొని ప్రాణత్యాగం చేస్తానంటోంది. నువ్వు మరేమీ చెప్పక నావెంట వచ్చెయ్. ఆ తర్వాత నేను మీవాళ్లను కలుసుకొని పరిస్థితి వివరించి వాళ్లను ఒప్పిస్తా. ఆ బాధ్యత నాది. రా వెళదాం" అంటూ ఎన్నో విధాల బ్రతిమాలాడు.

కాని ప్రయోజనం లేకపోయింది.

గోపాలం రానంటే రానన్నాడు. పోపొమ్మన్నాడు. శాంతను గురించి నిర్లక్ష్యంగా మాటాడాడు. 'అలా అనవద్దయ్యా బాబూ' అని చేతులు పుచ్చుకొని బ్రతిమాలినకొద్దీ చెట్టెక్కిపోయాడు. అసభ్యపు మాటలు అన్నాడు. సత్యానికి కోపం వచ్చింది. పళ్లు పటపటా కొరికాడు అంతలో కోపం అణచేసుకొన్నాడు. మరుక్షణంలో గోపాలం చెయ్యి పుచ్చుకొని 'పద మీ యింటికి వెళదాం' అంటూ బలవంతాన లాక్కొని వెళ్లాడు.

సత్యం గోపాలం తలిదండ్రులతో ఎంతోసేపు వినయంగా, నేర్పుగా, శాంతంగా అన్ని విషయాలూ మాటాడాడు. శాంత పరిస్థితి వివరించాడు. వాళ్ళిద్దరకూ వెంటనే వివాహం చెయ్యటం తప్ప మరో మార్గం లేదన్నాడు. కావాలంటే కోరినంత కట్నం పుచ్చుకోమన్నాడు. వాళ్ళు దేనికీ కాదంటే అతను గోపాలం తండ్రి కాళ్లమీద పడి వెక్కి వెక్కి ఏడుస్తూ "అది కూడా మీబిడ్డే అనుకోండి. మీరు కాదంటే అది

విషం పుచ్చుకొంటుంది. దానికి అభిమానం ఎక్కువ. దానికేదైనా అయితే మా అత్తయ్య ఉన్నపళంగా అమాంతం ఉరిపోసుకొంటుంది. మా యిల్లు నాశనం అవుతుంది. అలా చెయ్యకండి. మీరు సరే అనండి. వాళ్లు ప్రేమించుకొన్నారు. పెద్దవాళ్ల ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా ఇంతదూరం వచ్చారు. ఇక్కడ మనం అడ్డుకోవడం న్యాయంకాదు. ఇందులో మీకు జరిగే నష్టం ఏమీలేదు" అంటూ ప్రాధేయపడ్డాడు.

గోపాలం తండ్రి అతన్ని బలవంతాన లేవనెత్తి అవతలకు నెట్టేస్తూ "ఇదుగో ఈ పల్లెటూరి వేషాలన్నీ ఇక్కడ వెయ్యకు. మీ నాటకాలు మా ముందు కాదు. ముందు మర్యాదగా అవతలకు వెళ్ళు. మా వాడికీ ఆ పిల్లకూ ఏ సంబంధం లేదు. వాడికి లక్షణంగా పెళ్లి నిశ్చయం చేశాం. మీ పిల్ల విషయం మీరు చూచుకోండి. అది మాకు సంబంధించిన విషయం కాదు. మా యింటి మర్యాద మేం కాపాడుకోవాలి. మావాడు ఎప్పుడో ఏదో పొరపాటు చేశాడని మా గౌరవ మర్యాదలు మట్టిపాలు చేసుకొంటామా! వెళ్ళు- అనవసరపు మాటలు కట్టిపెట్టి మర్యాదగా వచ్చిన దార్నే వెళ్ళు" అన్నాడు.

ఆయన చెయ్యి విడిపించుకొని ఒక అడుగు వెనక్కు వేసి స్థిరంగా నిలబడ్డాడు. అతనికి కోపం వచ్చింది. కోపం అణచుకొంటూ కొంచెం పెద్దగా "మీరంతా పెద్దమనుష్యులని అనుకొన్నాను. గోపాలం లాగే మీరు మూర్ఖంగా మాటాడుతారని అనుకోలేదు. మీ మర్యాద ఏమిటో నేను చూస్తాను ఊళ్లో పదిమందినీ పిలుచుకొని వచ్చి ఇక్కడే పంచాయతీ పెట్టిస్తా. ఇంత దయా దాక్షిణ్యం లేకుండా మాటాడతారా- అన్నీ చూస్తానుండండి" అని వెనుతిరిగి చరచరా నాలుగు అడుగులు వేసి మనసులో ఏదో ఆలోచన మెదిలి ఆగిపోయి మళ్లి వెనుతిరిగి గోపాలం తండ్రితో "స్థానికులం కదా అని మీకు ఒక్కరికే బలం ఉందని అనుకోకండి. నన్ను బయటకు నెడితే సరిపోతుందని

అనుకోకండి. నేను తగిన బందోబస్తు చేసే వచ్చాన్లెండి" అన్నాడు. అల్లా అని నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకొంటూ వసారా చివరిదాకా వచ్చి మెట్లు ఒకటొకటే దిగి. వీధిలోకి వెళ్ళిపోబోతుంటే ముందు గదిలోనుంచి గోపాలం తాతగారు గబగబా అక్కడకు వచ్చి సత్యాన్ని వెనక్కు పిలిచాడు. అతను పైకి వసారాలోకి వచ్చాక ముందుకు వెళ్లి అప్యాయంగా చెయ్యి పుచ్చుకొని లోపలికి తీసుకొని వెళుతూ "అబ్బాయీ! మీ మాటలు విన్నా" అని తడబడి సర్దుకొని "విషయమంతా విన్నాను. మావాళ్లు తప్పు ధోరణిలో పడ్డారు. తప్పంతా వాళ్లదే. అయితే నువ్వు తొందరపడకు. రా. మనం కాస్త నిదానంగా అన్ని విషయాలూ మాట్లాడుకొందాం. నువ్వు సరియైన పరిష్కారం సూచించావు. నువ్వు వయస్సుకు చిన్నవాడివైనా చాలా బుద్ధిమంతుడవులా కన్పిస్తున్నావు" అన్నాడు. సత్యం ఆ మాటలు వింటూనే పొంగిపొయ్యాడు. అతనికి పోయిన ప్రాణం వచ్చినట్లు అయ్యింది. ఆ ముసలాయన పట్ల గౌరవం కలిగింది వెంటనే ముందుకు వంగి ఆయనకు పాదాభివందనం చేస్తూ "మీరు పెద్దవారు. జీవితానుభవం కలవారు. నేను తొందరపడ్డందుకు క్షమించండి. మీకు మాయందు దయ కలిగింది అంతే చాలు. మా కుటుంబాన్ని కాపాడండి. ఈ శుభ కార్యం మీ చేతిమీదుగా జరిపించండి. ఇక జన్మాంతం మీకు ఋణపడి ఉంటాం" అన్నాడు సత్యం.

ఆ ముసలాయన అతన్ని ఆప్యాయంగా లేవనెత్తి, నడుంచుట్టూ చేతులు వేసి పొదివి పుచ్చుకొని నెమ్మదిగా ముందుకు నడిపించుకొని వెళ్లి, తన గదిలో కుర్చీలో కూర్చోపెట్టి అందరి క్షేమసమాచారం చేశారు. తర్వాత నెమ్మదిగా "అబ్బాయి సత్యం, మనం ఇద్దరం ముందు అమ్మాయి దగ్గరకు వెళదాం. అమ్మాయిని తీసుకొని మీ యింటికి వెళదాం. మీ అత్తయ్య వాళ్లతో కూడా ఈ విషయం చెప్పి ఆవిడ

ఒప్పందంమీద అందరికీ గౌరవప్రదంగా ఉండేలా శుభకార్యం నిర్వహిద్దాం. సరేనా మరి. ప్రొద్దు పోయింది. నువ్వు భోజనం చేస్తే నాకు సంతోషం కాదూ గతికితే అతకదంటారు. కనుక భోజనం చెయ్యనంటావా. ఫలహారం, పాలూ తీసుకో. ప్రక్క ఇక్కడే వేయిస్తా పడుకో. నువ్వు శారీరకంగానూ, మానసికంగానూ చాలా హైరాన పడ్డావు. విశ్రాంతి తీసుకో. రెండు గంటలకు రైలుకు పోదాం. రేపు మధ్యాహ్నం భోజనాల వేళకు మనం పట్నం వెళదాం. అమ్మాయి ఎక్కడ ఉందన్నావూ?" అంటూ శాంత ఉన్న హోటలు పేరు, చిరునామా తెలుసుకొన్నాడు.

సత్యం ఎంతో సంతోషించాడు. అతనికి నిజంగా కడుపు నిండినట్లుగా ఉన్నది. ఫలహారం కూడా వద్దని ఒక్క అరటిపండు తిన్నాడు. ఆ ముసలాయన స్వయంగా తెచ్చి ఇచ్చిన పాలగ్లాసు అందుకొని గటగటా త్రాగేశాడు. గ్లాసు క్రింద పెడుతుంటే ఆయన దాన్ని అంది పుచ్చుకొన్నాడు. "అదేమో పాలు కొంచెం రుచికి బాగా లేనట్టున్నాయి. అంతే లెండి- బస్తీలో మీకు మంచి పాలు ఎక్కడ దొరుకుతాయి లెండి" అంటూనే సత్యం చాపమీదకు ఒరిగాడు. "ఇదేమిటండీ ఇంత వేగం నిద్ర వస్తున్నదీ! సరే మీరు కాస్త త్వరగా పడుకోండి. అలారం పెట్టారు కదూ? కొంచెం ముందుగా లేపండి. రైలుకు వెళ్లేటప్పుడు, ఎప్పుడూ కాస్త ముందుగా వెళ్ళడం మంచిది" అంటూ కళ్ళు మూసుకొన్నాడు మరుక్షణంలో అతనికి నిద్ర ముంచుకొని వచ్చినది.

* * *

ఇంటి ముందు ఆగిన టాక్సీలోనుంచి శాంత దిగడం చూచి కనకమ్మగారు ఒక్క అంగలో ముందుకు వచ్చి "వచ్చావుటే అమ్మా

ఏమయిపోయావో అని దిగులుపడి పొయ్యానే" అంటూ సంతోషం పట్టలేక కూతురును కౌగలించుకో పోయింది. శాంత ఒక అడుగు వెనక్కు వేసి గంభీరంగా ముఖంపెట్టి "నేను రావడానికేంలే- అటు బావయ్య చూడు. అతన్ని ముందు లోపలకు చేర్చండి" అన్నది.

సత్యాన్ని టాక్సీడ్రైవరు సాయంతో లోపలకు తీసుకొని పడుకో పెట్టిన తర్వాత కనకమ్మగారు నెమ్మదిగా "ఏమిటీ సత్యం అలా ఉన్నాడు. ఎన్నడూ ఏ రోగం రొష్టూ ఎరుగనివా డిలా వణకడం ఏమిటి? జబ్బేమిటి? అసలు ఏం జరిగింది?" అన్నది. ఆ మాటలు విని ఎంత నిర్లక్ష్యంగా, ఎంత నింపాదిగా అడుగుతున్నదో- 'అవునులే తనకు అతను పరాయివాడు కదా!' అనుకొన్నది శాంత. ఆవిడ ప్రశ్నలకు సమాధానం చెప్పక "ముందు పెద్ద మావయ్యను పిలిపించు. అక్కడ మద్రాసులో వైద్యుణ్ణి పిలిపించి చూపిస్తే ఏదో ప్రమాదం ముంచుకొని వచ్చే సూచనలు కన్పిస్తున్నాయనీ, ఇంటికి తీసుకొని వెళ్ళి అయినవాళ్ల మధ్య ఉంచడం మంచిదనీ చెబితే గత్యంతరం లేక తీసుకొని వచ్చాను" అన్నది శాంత.

కనకమ్మగారి అన్న రవణయ్యగారు పెద్ద డాక్టర్ను పిలుచుకొని వచ్చాడు. వారం రోజులు చికిత్స జరిగాక ఆ వైద్యుడి మాటలు విని ఆయన చాలా గాభరాపడ్డారు. ఆ వైద్యుడు వెళ్ళాక ఆయన కనకమ్మ గారితో "ఇదేమిటే నాడి పరిస్థితి ఆరోజు కారోజు క్షీణిస్తున్నది. వ్యాధి ఏమిటో అంతుపట్టడం లేదు. కాని గుండె మాత్రం చాలా బలహీనంగా ఉన్నదనీ మనిషి కోలుకోవడం కష్టమనీ డాక్టరు అంటున్నాడు" అంటూ ఆందోళన వ్యక్తపరిచాడు. కనకమ్మగారు ఏమీ మాటాడక పొయ్యేసరికి ఆయన ఉండబట్టలేక "అవున్లే తెలుస్తూనే ఉన్నది వాడి విషయం నీకు ఏమీ పట్టలేదు. ఏదో విధంగా కూతురు ఇంటికి వచ్చింది. అదే పదివేలని సంతృప్తి పడ్డావు. బావ పోయిననాటి నుంచి ఈ యిల్లు

కనిపెట్టుకొని ఉన్నాడు సత్యం. తనకు కొంత పొలం పుట్రా ఉన్నా చిన్నప్పుడు బావ చేసిన ఉపకారం మర్చిపోక మీ యింటిలో ఉండి, మీకు అందరికీ సేవ చేశాడు. నీకు వాడిమీద ఇంటి పాలేరుమీద ఉండే పాటి అభిమానమైనా లేదు. అసలీస్థితి ఎందుకు వచ్చింది. దాన్ని గట్టిగా అడగ వెందుకని? అది మద్రాసులో సినిమాలో చేరడానికి వెళ్లినదనడం అబద్ధం. ఇదంతా సత్యం కల్పన. మొన్న మద్రాసునుంచి మా అల్లుడు, అతని స్నేహితులు మా యింటికి వచ్చారు. గోపాలం గురించీ, దీన్ని గురించీ ఏవేవో చెప్పారు. నిజానిజాలు గట్టిగా తెలియవు" అన్నాడు.

కనకమ్మగారు ముఖం ముడుచుకొని లోపలకు వెళ్లింది.

మరో వారం రోజులు గడిచాయి.

*  *  *

"ఏమిటి బావయ్యా ఆదోలా చూశావు? నాకు నీస్థితి అంతువట్టడం లేదు. ఇటు ఒక్కసారి నా స్థితి చూడు. నాకు దిక్కు తోచడం లేదు. మద్రాసులో అయితే ఏదో మార్గం నేనే చూచుకొనేదాన్ని. నీ పరిస్థితి ప్రమాదంగా ఉన్నదని అక్కడినుంచి నిన్ను తీసుకొని ఇక్కడకు వచ్చాను. ఇక్కడ అరక తెరలో పోకలా నలిగిపోతున్నా, అసలూ గోపాలం వాళ్ల ఇంటిదగ్గర ఏం జరిగింది? నిన్ను ఎవరో ముసలాయన తీసుకొని వచ్చి నా గదిలో పడుకోపెట్టి వెళ్లాడని హోటలువాళ్ళు చెప్పారు. ఆయన ఎవరు? ఏమిటిదంతా? మేం ఎవరు ఏమి అడిగినా సమాధానం చెప్పవేమిటి? మొన్న డాక్టరుగారితో అన్నీ తెలుస్తూనే ఉన్నాయని చెప్పావు గదా! ఇదిగో నువ్వు ఇలా అధైర్యపడకు. మొన్న మా పెద్దమామయ్య నా విషయం ఏదో అనుమానం కలిగి ఓ మనిషిని గోపాలంవాళ్ల ఊరు పంపారు. తద్వారా వాళ్లకు కొన్ని విషయాలు తెలిశాయి. నా విషయం గోపాలం తల్లే చెప్పి ఏదో తిట్టిపోసిందట.

ఆ గోపాలానికి పెళ్లయిపోయిందట. ఇక నాకు అక్కడ చోటు లేదు. ఈ సంగతి తెలిసిన గత రెండు మూడు రోజులనుంచీ వీళ్ళిద్దరూ నన్ను దీనికి కారకులెవరో చెప్పమని వేధిస్తున్నారు దీనికి కారణం గోపాలమేనా చెప్పు వాడి ప్రాణం తీస్తాను. చెప్పకపోతే నిన్ను విడిచిపెట్టను' అని మామయ్య, 'చెప్పవే నిజం చెప్పు గోపాలం తల్లి ఇందుకు వేరెవరో కారకులన్నదట ఎవరో చెప్పు' అని మా అమ్మ చంపుకు తినేస్తున్నారు. మా అమ్మ చీరకొంగు ఉరిపోసుకొని చావడానికి సిద్ధపడింది. 'నిన్నెందుకు అడగడం వెళ్లి గోపాలం గొంతు నొక్కుతా. వాడే చెబుతాడు' అంటూ రంకెలువేస్తూ వీధిలోకి వెళ్లిపోయాడు వాళ్ల పోరు పడలేక, ఎల్లాగో ఈ పరిస్థితిలో నుంచి తప్పించుకొందామని నువ్వే కారకుడవని అనేశాను. వాళ్ళిద్దరూ ఒక్క క్షణం నివ్వెరపోయారు. మా అమ్మ నమ్మినట్లే కనిపిస్తున్నది. మా మామయ్య మాత్రం నమ్మడం లేదు. ఏమైనా వాళ్ళు నిన్ను ఈ పరిస్థితిలో ఏమీ అడుగరు. అందుకే నే నలా చెప్పాను. నువ్వు ఏమీ అనుకోకు. ఇలా అన్నానని బాధపడకు. నీకు కాస్త జబ్బు నయం అయ్యాక మనం ఎక్కడికైనా దూరప్రాంతానికి పోదాం. నాకీ గండం గడిచేదాకా ఉండు. ఆ తర్వాత నాదారిని నేను వెళతాను నా కోసం నువ్వు..." అంటూ ఇంకా ఏమో చెప్పబోతూ సత్యంవంక చూచి ఆగిపోయింది శాంత.

సత్యం దుఃఖపడుతున్నాడు.

కన్నీరు చెంపలపైగా ధారలు కట్టాయి.

కన్నీరు పయటకొంగుతో నెమ్మదిగా తుడుస్తూ శాంత "ఊరుకో బావయ్యా ఊరుకో" అంటూ అనునయించింది.

కొంతసేపు తర్వాత అతను మరోవైపుకు తిరిగి పడుకొన్నాడు. అతనిని నిద్ర పట్టింది శాంత నెమ్మదిగా లేచి, అతనికి దుప్పటి కప్పి గది తలుపు దగ్గరకు వేసి తన గదిలోకి వెళ్ళి పడుకొన్నది.

సత్యం కొంతసేపు నిద్రలోనే మూలిగాడు.

అంతలో మూలగడం కూడా మానేశాడు.

అతను ఆ నిద్రలోనే శాశ్వతంగా కన్ను మూశాడు.

ఆ విషయం శాంతకు ఆ మరునాటి ఉదయం కాని తెలియలేదు.

సత్యాన్ని బయటకు చేరవేస్తుంటే శాంత పెద్దగా ఏడుస్తూ "నాకు ఎంతో సాయం చేస్తాను అన్నావు కదా బావయ్యా. ఏమీ చెయ్యకుండానే పోతున్నావా. నీ చావుకు నేనే కారకురాలను బావయ్యా. నీమీద అపవాదు కూడా వేశాను బావయ్యా. నీ చావుకు అసలు కారణం నాకు తెలుసు బావయ్యా. నిన్ను నేనే చంపాను బావయ్యా" అంటూ శోకాలు పెట్టింది.

శాంత మాటలు ఎవరూ వినిపించుకోలేదు.

చివరకు సత్యం కూడా వినిపించుకోలేదు.

———